

నేటి నుంచి జాతీయ బాలల నాటకోత్సవాలు

షాద్‌నగర్ అర్బన్, జూలై 19: షాద్‌నగర్ సమీపంలోని హాజిపల్లి శివారులోని ఏవీ కన్వెన్షన్‌లో నేటి నుంచి రెండు రోజుల పాటు జాతీయ బాలల నాటకోత్సవాలు జరుగుతాయని నవకళా భారతి ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు రంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో తెలంగాణ, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి బాలలు పాల్గొంటారని తెలిపారు. శనివారం సాయంత్రం ప్రారంభమయ్యే నాటకోత్సవంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాష్ట్ర భాష, సంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొంటారని తెలిపారు.

ఉడకని పప్పులు!

అమాంతం పెరిగిన పప్పుల ధరలు

నిత్యావసర సరుకుల ధరలు, ఇంధన ధరలు ఇలా సామాన్యుల నెత్తిన ఎన్నో భారాలున్నాయి. వచ్చే బెత్తెడు ఆదాయానికి.. మూరెడు ఖర్చులు ఎదురు చూస్తుంటాయి. ఓ వైపు కూరగాయల ధరలు కుతకుతమంటుంటే.. మరో వైపు పప్పుల ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. కంది, పెసర, మినపప్పు, శనగ, ఎర్రపప్పు ఇలా ఏ పప్పు తీసుకున్నా ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్యుడికి అందనంత ఎత్తులోకి వెళ్లాయి. పప్పుల పరిస్థితి ఇలా ఉంటే.. కూరగాయల పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిన్న మొన్నటి వరకు కాస్త తగ్గిన టమాట ధర మళ్లీ సెంచరీ కొట్టింది. ఉల్లిగడ్డ కోయకుండానే కన్నీరు పెట్టిస్తోంది.

- ఆస్ట్రేలియా నుంచి నిలిచిన దిగుమతి
- ప్రభుత్వం సబ్సిడీ ఎత్తివేయడంతో సాగుకు మొగ్గు చూపని రైతులు
- దారుణంగా పడిపోయిన దిగుబడులు
- దీంతో భారీగా ధరలు పెంచిన వ్యాపారులు
- కూరగాయల పరిస్థితి అంతే
- మళ్లీ పెరిగిన టమాట ధర



వానాకాలం -2024, వ్యవసాయ ప్రణాళిక (ఎకరాల్లో)

పంట	సాగు లక్ష్యం
పెసలు	48
కందులు	11,548
మినుములు	34

2023-24 యాసంగిలో సాగు (ఎకరాల్లో)

పంట	సాధారణ విస్తీర్ణం	సాగైన విస్తీర్ణం
పెసలు	22	10
శనగ	6,497	1,484
మినుములు	34	23



ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూలై 19: ప్రతీ ఇంట్లో కనీసం వారానికి రెండు, మూడుసార్లైనా పప్పు వండాల్సిందే. సాంబార్, పప్పుచారు, ఆకుకూర కాంబినేషన్ ఇలా ఏదో విధంగా పప్పు ఉడకాల్సిందే. అయితే, ఆ పప్పుకు ఇప్పుడు దూరమయ్యే పరిస్థితి వచ్చింది. పప్పుల ధరలు అమాంతంగా పెరిగి ఆకాశాన్నంటాయి. పేద, మధ్య తరగతి ప్రజలు వాటిని కొనే పరిస్థితి లేకుండా పోయింది. మార్కెట్‌లో నిన్నమొన్నటి వరకు కిలో కందిపప్పు ధర రూ.140 నుంచి 160 మధ్య ఉండగా ఇప్పుడు రూ.200కు చేరువయ్యింది. సూపర్ మార్కెట్లలో క్వాలిటీని బట్టి కేజీ రూ. 220-240 వరకు కూడా ధర పలుకుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కందిపప్పుతో పాటు మిగతా పప్పుల ధరలు కూడా భారీగా పెరిగాయి. కేజీ పెసరపప్పు నెల క్రితం రూ. 100 ఉండగా ప్రస్తుతం రూ. 120-130కి చేరింది. మినపప్పు రేటు కూడా దూసుకుపోతోంది. ఎర్రపప్పు, శనగపప్పు కిలో రూ.90-100 విక్రయిస్తున్నారు. ఇక ఉల్లి ధరలు కూడా కన్నీరు పెట్టిస్తున్నాయి. రెండు, మూడు నెలల క్రితం వరకు కేజీ ఉల్లి రూ. 25కు లభించగా ప్రస్తుతం రూ.50కి చేరింది. వారంక్రితం వరకు కూడా చిరు వ్యాపారులు రూ.100కు నాలుగు కేజీల చొప్పున విక్రయించగా.. ప్రస్తుతం రూ.100కు రెండు, రెండున్న కేజీలు మాత్రమే ఇస్తున్నారు. గతేడాది వర్షాభావం, వర్షాభావ పరిస్థితుల వల్ల ఉత్పత్తి 40 శాతం వరకు తగ్గిందని వ్యాపారులు అంటున్నారు. అందువల్లే ధరలు విపరీతంగా పెరిగాయని చెబుతున్నారు.

సబ్సిడీ ఎత్తేసిన గత సర్కార్..!

జిల్లాలో రైతులు కేవలం వరి, పత్తి, కూరగాయల సాగుపైనే దృష్టి సారిస్తున్నారు. వర్షాధార పంటలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అతివృష్టి, అనావృష్టితో పంటలు ఎండిపోయి నష్టపోతున్నారు. దీంతో రైతులు వాటి సాగు వైపు చూడటం లేదు. దీనికి తోడు గత ప్రభుత్వం కంది, పెసర, మినుములు, శనగ వంటి విత్తనాలపై సబ్సిడీని ఎత్తివేసింది. దీంతో రైతులు పప్పు పంటల సాగును పూర్తిగా వదిలేశారు.



ఆస్ట్రేలియా నుంచి దిగుమతి తగ్గడంతో..

కందిపప్పు నగరంతో పాటు ఇతర ప్రాంతాలకు ఆస్ట్రేలియా నుంచి ఎక్కువగా దిగుమతి అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు. లోకల్ పప్పులతో పోల్చితే విదేశీ సరుకు రేట్లు తక్కువగా ఉండడంతో 2 నుంచి 3 శాతం లాభం చూసుకుని అమ్మకాలు చేపడుతుంటామని పేర్కొంటున్నారు. రెండు నెలలుగా ఆస్ట్రేలియా నుంచి కందిపప్పు దిగుమతి బాగా తగ్గడంతో మహారాష్ట్ర, లాతూరు నుంచి వచ్చే పప్పులకు డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో హోల్‌సేల్ వ్యాపారులు కిలోకు రూ.10 చొప్పున పెంచి అమ్ముతుండగా, రిటైల్ వ్యాపారులు దానికి మరో రూ.20-30 వరకు అదనంగా పెంచి దండుకుంటున్నారు. నగర శివారు, గ్రామీణ ప్రాంతాల్లోనైతే అదనంగా రూ.40వరకు పెంచి అమ్ముతున్నారు. దీనికి తోడు మినపపప్పు శనగపప్పు చింతపండు ధరలు పెరగడంతో ప్రజలు పరేషాన్ అవుతున్నారు.

మళ్లీ పెరిగిన టమాట ధర

గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా టమాటా సహా అన్ని రకాల కూరగాయలు ధరలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ముఖ్యంగా కూరగాయల సాగు జిల్లాలో తగ్గిపోవడం, డిమాండ్‌కు తగిన దిగుబడి లేకపోవడంతో ఒక్కసారిగా ధరలు పెరిగాయి. ఇక టమాటా ధరలు చూస్తే సామాన్య ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కొద్ది రోజులుగా రోజులుగా టమాటా ధర కేజీ రూ.100 పలుకుతుండగా.. ఈ మధ్యలో కాస్త తగ్గింది. దీంతో సామాన్య జనం కాస్త ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఇప్పుడు వర్షాలు కారణంగా టమాట తోటలకు చీడ పట్టింది. దీంతో దిగుబడి దారుణంగా పడిపోయింది. సగానికి సగం కూడా దిగుబడి రాకపోవడంతో టమాట ధరలు అమాంతంగా పెరిగాయి. దీంతో టమాటా ధర పెరుగుతూ వస్తోంది. మార్కెట్లలో కేజీ టమాటా రూ.100కు చేరింది.

పప్పుధాన్యాల సాగుకు ప్రోత్సాహం కరువు

ఆహార భద్రత పథకంలో భాగంగా పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశిస్తున్నా క్షేత్ర స్థాయిలో సరైన ప్రోత్సాహం లభించడం లేదు. దీంతో పప్పు దినుసుల సాగుకు రైతులు ముందుకు రావడం లేదు. ప్రతి సంవత్సరం వ్యవసాయశాఖ లక్ష్యాలు ఘనంగా పెట్టుకుంటున్నా ఆచరణలో లక్ష్యం నెరవేరడం లేదు. జిల్లాలో గతంలో పప్పుధాన్యాల సాగు భారీగా ఉండగా కాలక్రమేణా సాగు విస్తీర్ణం తగ్గిపోతూ వస్తోంది. పెట్టుబడులు పెరగడం, కూలీల కొరత ఉండటం, మార్కెట్‌లో మద్దతు ధర లభించక పోవడంతో రైతులు పప్పుధాన్యాల సాగుపై ఆసక్తి చూపడం లేదు.

ధరలు భారంగా మారాయి



కంది, పెసర, శన, మినుము పప్పుల ధరలు చూసి కొనలేకపోతున్నాం. నెల రోజుల్లోనే కేజీకి రూ.20 వరకు పెరిగింది. కిరాణ సామాను ధరలు భారంగా మారాయి. రేట్లు పెరగడంతో కూలి, నాలి చేసుకునే మాలాంటి కుటుంబాలు తట్టుకోలేకపోతున్నాయి. ఉప్పు నుంచి పప్పు వరకు అన్నీ పెరుగుతున్నాయి. కందిపప్పును కొనే పరిస్థితి కనిపించడం లేదు.


\- మమత, గృహిణి, తుమ్మలపల్లి, చౌదరిగూడ మండలం

పప్పుల ధరలు పెరిగాయి



రెండు నెలలుగా పప్పుల రేట్లు గరిష్ఠంగా పెరిగాయి. కిలోకు రూ. 20 నుంచి 30 వరకు పెరిగింది. దీంతో గతంలో నెలకు 5 కిలోల వరకు తీసుకునే కందిపప్పును కొంతమంది రెండు కిలోలే తీసుకుంటున్నారు. ధరలు ఎప్పుడు తగ్గుతాయనే విషయం ఇప్పుడే చెప్పలేం.

\- కుంచం శ్రీనివాస్, వ్యాపారి, చేవెళ్ల



ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన కొత్త జాతీయ జెండా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జాతీయ జెండాల పునరుద్ధరణ

ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్ట ప్రధాన తూము వద్ద చిరిగిన జాతీయ జెండాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేశారు. జాతీయ జెండాలు గాలికి చిరిగి పోయిన విషయాన్ని ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో 'జాతీయ జెండాలను పట్టించుకోండి' శీర్షికతో ప్రచురించింది. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు శుక్రవారం చిరిగిన జెండాల స్థానంలో తూము గుమ్మటం, ముందు భాగంలో కొత్త జెండాలను ఏర్పాటు చేశారు.

ఇబ్రహీంపట్నం, జూలై 19

వేద పాఠశాల నిర్మాణానికి భూమిని కేటాయించండి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరిన రంగరాజన్

మొయినాబాద్ రూరల్, జూలై 19: చిలుకూరు బాలాజీ దేవాలయం పరిసరాల్లో నిర్మించ తలపెట్టిన వేద పాఠశాలకు భూమిని కేటాయించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు, తెలంగాణ ఆలయాల పరిరక్షణ ఉద్యమ కమిటీ కన్వీనర్ సీఎస్. రంగరాజన్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మొయినాబాద్ మండలం చిలుకూరు రెవెన్యూ పరిధిలో వేద పాఠశాల నిర్మాణం కోసం 5 ఎకరాల కోసం స్థలం కేటాయించి విస్మరించిందని చెప్పారు. అయితే, దీని నిర్మాణానికి టీటీడీ నుంచి కూడా నిధులు వచ్చే అవకాశం ఉన్నందున వేద పాఠశాలకు వెంటనే భూమిని మళ్లీ కేటాయించి నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా వంశపారంపర్య అర్చకత్వాన్ని కూడా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి, వేములవాడ, బాసర తదితర పురాతన ఆలయాల సంప్రదాయ అర్చకుల పెండింగ్ సమస్యలను భట్టి దృష్టికి తీసుకు వెళ్లినట్లు రంగరాజన్ చెప్పారు. వంశపారంపర్య అర్చకులు ఆచార వ్యవహారాలను ప్రభుత్వం నిలిపివేస్తే సంప్రదాయ దేవాలయాలు, గ్రామీణ దేవాలయాలు మూతపడతాయని 1996లో డాక్టర్ ఎంవీ. సౌందరరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీం కోర్టు సానుకూలంగా స్పందించిన విషయాన్ని రంగరాజన్ గుర్తుచేశారు. అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 2007లో ఒకచట్టం ద్వారా వారి సేవలను పునరుద్ధరించిందన్నారు. ఇది జరిగి 16 ఏళ్లు గడిచినా తెలంగాణలో ఈ సవరణ చట్టం ఇప్పటికీ అమలు కావడం లేదన్నారు. ఏపీ ప్రభుత్వం 2019లో జీవో ఎంఎస్ 439 జారీ చేసి వేలాది అర్చక కుటుంబాలకు వారసత్వ ప్రక్రియను ప్రారంభించిందని తెలిపారు. ఈ సమస్యలపై భట్టి సానుకూలంగా స్పందించినట్లు రంగరాజన్ తెలిపారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన సీఎస్ రంగరాజన్

రాత్రంతా చెట్టుకిందే!

కిడ్నాపర్ల చెరనుంచి ఇంటికి చేరుకున్న బాలిక

- ఊపిరి పీల్చుకున్న పోలీసులు
- మిస్టరీగా మారిన బాలిక అపహరణ
- అగంతకుడి కోసం పోలీసుల గాలింపు



తల్లి ఒడికి చేరిన కాజోల్ సింగ్

కొత్తూర్: జూలై 19: ఓ వైపు వర్షపు ముసురు... మరో వైపు అంధకారం.. రాత్రంతా చెట్టు కిందనే.. ఇదీ కిడ్నాప్‌నకు గురైన ఎనిమిదేళ్ల బాలిక కాజోల్‌సింగ్ అనుభవించిన కష్టం. చివరకు కిడ్నాపర్ల చెర నుంచి శుక్రవారం ఉదయం బయట పడి ఇంటికి చేరుకుంది. కొత్తూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గురువారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటున్న బాలిక కాజోల్‌సింగ్(8)ను గుర్తు తెలియని ఆగంతకుడు అపహరించుకపోయాడు. ఎల్లకేలకు ఇంటికి చేరుకున్న బాలిక, ఆమె తల్లిదండ్రులు కాజోల్‌సింగ్ అపహరణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గుర్తు తెలియని అగంతకుడు కాజోల్‌సింగ్‌ను అపహరించిన తర్వాత కొత్తూర్ మీదుగా జేపీ దర్గా రోడ్డుకు కాలినడకన బాలికను తీసుకెళ్లాడు. దాదాపు నాలుగు కిలోమీటర్ల పాటు బాలికను నడిపించుకుంటూ వెళ్లాడు. అక్కడి నుంచి రోడ్డు దిగి కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఓ చెట్టుకింద బాలికను వదిలిపెట్టి పరారయ్యాడు. ఓ పక్క వాన ముసురు, మరో పక్క అంధకారం.. దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ ఉన్న కాజోల్‌సింగ్ రాత్రంతా అక్కడే గడిపింది. తెల్లవారుజామున రోడ్డుపైకి వచ్చిన బాలిక అటుగా వస్తున్న ఆటోను ఆపింది. బాలికను చూసిన డ్రైవర్ ఆటో నిలిపి ఎక్కడకు వెళ్లాలంటూ ప్రశ్నించాడు. దీంతో తాను తప్పిపోయి వచ్చానని, కొత్తూర్‌లో వదలాలని ప్రాధేయపడింది. దీంతో ఆటో డ్రైవర్ బాలికను ఆటోలో ఎక్కించుకుని కొత్తూర్‌లో దించి వెళ్లిపోయాడు. బాలిక అక్కడి నుంచి తమ ఇంటికి చేరుకుంది. ఇంటికి చేరుకున్న బాలికను చూసిన తల్లిదండ్రులు అక్కున చేర్చుకుని కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఎస్సీ కాలనీకి చేరుకుని బాలికతో పాటు ఆమె తల్లి నుంచి వివరాలు సేకరించారు. రాత్రి జరిగిన విషయాన్ని బాలికతో పాటు, తల్లి పోలీసులకు వివరించింది. బాలికను పోలీసులు ఆసుపత్రికి తరలించి, వైద్య పరీక్షల అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిక క్షేమంగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మిస్టరీగా మారిన బాలిక అపహరణ

కాజోల్‌సింగ్ అపహరణ విషయంవ 'మిస్టరీగా మారింది. గుర్తు తెలియని వ్యక్తి బాలికను ఎందుకు అపహరించాడు?. ఎందుకు వదిలిపెట్టాడు...అనే విషయం పోలీసులకు సవాల్‌గా మారింది. బాలిక అపహరణకు గురైన విషయం దావా నంలా వ్యాపించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. శంషాబాద్ ఏసీపీ శ్రీనివాసరావు, స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహరావు, ఎస్ఐ జి. శ్రీనివాస్‌లు తమ సిబ్బందితో గురువారం రాత్రి బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించి వివరాలు సేకరించారు. బాలిక కోసం పోలీసులు ప్రత్యేక బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టారు. సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించగా, బాలికను అపహరించుకపోయిన అగంతకుడు కాలినడకన తీసుకెళ్లి జేపీ దర్గా రోడ్డులోని రంగాపూర్ దాటినట్లు సీసీ కెమెరా రికార్డులో కనిపించింది. అ తర్వాత సీసీ కెమెరా రికార్డులు కనిపించలేదు. రోడ్డు సమీపంలో ఉన్న ఓ చెట్టు దగ్గర బాలికను వదిలేసిన అగంతకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక అపహరణపై ఆమె కుటుంబసభ్యులు సరిగ్గా స్పందించకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తున్న విషయం పోలీసులు జరిపిన దర్యాప్తులో బయటకు వచ్చినట్లు తెలిసింది. పోలీసులు శుక్రవారం కూడా నిందితుని కోసం గాలింపు నిర్వహించారు. నిందితుడు దొరికితే తప్ప బాలిక అపహరణ విషయం బయటకు వచ్చే అవకాశం లేకపోలేదు.

ఆగిన విమానయాన సేవలు

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆగమాగం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/శంషాబాద్)



ఎయిర్‌పోర్టులో వేచిఉన్న ప్రయాణికులు

ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కూడా తీవ్ర ప్రభావాన్ని చూపించింది. శంషాబాద్ నుంచి 39 దేశీయ విమానసర్వీసులు శుక్రవారం రద్దయ్యాయి. మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. శుక్రవారం రాత్రి 8గంటల వరకు 39 దేశీయ విమాన సర్వీసులు రద్దు కాగా 44 సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. అలాగే 10 అంతర్జాతీయ సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ప్రయాణీకులు శుక్రవారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుకింగ్, చెకింగ్ సేవల్లో అంతరాయం కలగడంతో కొన్ని గంటల పాటు విమాన సేవలన్నీ నిలిచిపోయాయి. కంప్యూటర్లు మొరాయించడంతో పాటు డిస్‌ప్లే బోర్డులు కూడా పనిచేయలేదు. దీంతో ప్రయాణీకులకు ఏ విమానం ఎక్కడ ఉందో తెలియక తికమకపడ్డారు. ఇదిలా ఉంటే అంతర్జాతీయ ప్రయాణీకులకు బోర్డింగ్ పాస్‌ల జారీ కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఎయిర్‌పోర్టు నిర్వాహణ సంస్థ జీఎంఆర్ వెల్లడించింది. విమానసర్వీసులు దాదాపు ఒక్కసారిగా నిలిచిపోవడంతో శంషాబాద్ నుంచి దేశ, విదేశాలకు వెళ్లే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విమాన సర్వీసులు రద్దు కావడంతో ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. టికెట్లు బుకింగ్, చెక్ ఇన్ బ్యాగులు వంటి వద్ద సమస్యలు తలెత్తాయి.

ప్రత్యేక సిబ్బంది నియామకం : జీఎంఆర్

అంతర్జాతీయ విమాన సర్వీసులకు ఇబ్బంది కలగకుండా జీఎంఆర్ అధికారులు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసింది. ఉదయం నుంచి మైక్రోసాఫ్ట్ విండోస్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో విమాన సర్వీసులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాంటి సమస్య తలెత్తకుండా బోర్డింగ్ పాస్, చెక్ ఇన్ వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జీఎంఆర్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కనీస సమాచారం ఇవ్వలేదు



గోరఖ్‌పూర్ నుంచి రావాల్సిన ఇండిగో విమానం దాదాపు రెండున్నర గంటలు ఆలస్యంగా బయలుదేరింది. విమాన సిబ్బంది ప్రయాణికులకు కనీస సమాచారం ఇవ్వలేదు.. విమానం ఎందుకు ఆలస్యమైంది? ఎలాంటి సాంకేతిక సమస్య తలెత్తింది? అనే విషయాలు ఎయిర్‌లైన్స్, ఎయిర్‌పోర్టు సిబ్బంది కానీ సమాచారం ఇవ్వలేదు. - అభిలాష్, ప్రయాణికుడు

రెండు గంటలు ఆలస్యం



గోవా నుంచి ఎయిరిండియా విమానంలో హైదబాద్‌కు టికెట్ బుక్ చేసుకున్నా. మధ్యాహ్నం 2 గంటలకు విమానం బయలుదేరాలి. కానీ, సాయంత్రం 4 గంటలకు బయలుదేరింది. దాంతో రెండు గంటలు ఎయిర్‌పోర్టులోనే వేచి ఉన్నాం. ఎయిర్‌లైన్స్ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. విమానం ఎందుకు ఆలస్యమైందని ప్రశ్నించగా సాంకేతి లోపం తలెత్తింది, త్వరలోనే వెళుతుందని చెప్పి రెండు గంటలు ఆలస్యం చేశారు.

కృష్ణయ్య, ప్రయాణికుడు

జడ్పీహెచ్ఎస్‌కు డ్యూయల్ డెస్క్‌లు



బషీరాబాద్ పాఠశాలకు చేరుకున్న డ్యూయల్‌డెస్క్ బెంచీలు

బషీరాబాద్, జూలై 19: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల (బాలికలు)కు డ్యూయల్ డెస్క్ బెంచీలు చేరుకున్నాయి. మనఊరు- మనబడి పథకం కింద 150డ్యూయల్ డెస్క్‌లు పాఠశాలకు చేరినట్లు జీహెచ్ఎం హీర్యానాయక్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి అధునాతనమైన బెంచీలు రావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్ర అభివృద్ధి

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



తాండూరులో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు, జూలై 19: జాతీయవాదం, రాజకీయాలకు అతీతంగా ప్రధాని మోదీ ఆర్థికంగా తెలంగాణకు సహకరించడంతోనే అభివృద్ధి సాధ్యమవుతోందని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. తాండూరు పట్టణం తులసీ గార్డెన్‌లో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌర సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుంటే రాష్ట్ర సర్కార్ ఎప్పుడో కూలిపోయేదని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని అన్నారు. రూ.లక్షా 35వేల కోట్ల ఆదాయానికిగాను రూ.50వేల కోట్లు వేతనాలకే సరిపోతున్నదని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులను రూ.80వేల కోట్లు చెల్లించాల్సి వస్తుందని అన్నారు. పింఛన్లు, ఆరు గ్యారంటీల అమలు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయలేని పరిస్థితిలో ఉండగా కేంద్ర ప్రభుత్వం జనవరి మాసంలో రూ.9వేల కోట్లు, ఫిబ్రవరి రూ.3వేల కోట్లు, మార్చిలో రూ.4వేల కోట్లను రాష్ట్రానికి అందించిందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంటు పరిధిలో 7వేల మంది వార్డు సభ్యులు, 800 మంది సర్పంచ్‌లు బీజేపీ అభ్యర్థులు గెలవాలని లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలోఓ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు యు.రమేష్, బీజేపీ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రజనీకాంత్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, బీజేపీ సీనియర్ నాయకులు నరేష్ మహరాజ్, గాజుల శాంత్‌కుమార్, బాలి శివకుమార్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా పాల్గొన్నారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

శ్రీ విద్యావిహార్ స్కూల్‌పై విచారణ జరపాలి

జాతీయ బాలల హక్కుల కమిషన్ ఆదేశం

ఘట్‌కేసర్, జూలై 19: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో గల శ్రీవిద్యావిహార్ స్కూల్ యాజమాన్యం బాలల హక్కులను హరిస్తున్నదని విద్యార్థుల తల్లిదండ్రులు జాతీయ బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన కమిషన్ శ్రీవిద్యావిహార్ పాఠశాలలో నింబంధనల ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి వారం రోజుల్లో నివేదిక అందజేయాలని మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్‌కు కమిషన్ సూచించింది. కాగా శ్రీవిద్యావిహార్ స్కూల్ యాజమాన్యం అధిక ఫీజులు వసులు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అదేమని అడిగితే విద్యార్థులకు టీసీలు ఇచ్చి ఇంటికి పంపిస్తున్నారని తెలిపారు. గతంలో విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసిన సందర్భాలున్నాయి.

శనీశ్వర ఆలయంలో టెంకాయల వేలం

మోమిన్‌పేట్, జూలై 19: ఎన్కతలలోని శనీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం టెంకాయల విక్రయానికి వేలం నిర్వహించారు. ఈ వేలంలో రూ.2లక్షల 65వేలకు గ్రామానికి చెందిన బోయ శ్రీనివాస్ దక్కించుకున్నాడు. ఆలయ కమిటీ మేనేజర్ నరేందర్ పాల్గొన్నారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

వికారాబాద్, జూలై 19: ఈ నెల 21న భగవాన్ శ్రీ సత్యసాయి జ్ఞాన కేంద్రంలో గురు పౌర్ణమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సత్యసాయిజ్ఞాన కేంద్రం కన్వీనర్ సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

సహకార బ్యాంకు నిర్మాణానికి భూమి పూజ



సహకార బ్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీసీసీ చైర్మన్ సత్తయ్యయాదవ్

మోమిన్‌పేట్, జూలై 19: మండల కేంద్రంలో కొన్ని సంవత్సరాలుగా సొంత భవనానికి నోచుకోని సహకార బ్యాంకు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషించదగ్గ విషయమని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కె.సత్తయ్య యాదవ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం రూ.63 లక్షల నిధులతో నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. మండల కేంద్రానికి సెంటర్ పాయింట్ ఉండటంతో అన్ని మండలాలకు అనుసంధానంగా ఉండేందుకు నూతన భవన నిర్మాణంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ భైండ్ల విజయ్‌కుమార్, తహసీల్దార్ మనోహరచక్రవర్తి, సీఈవో భాస్కర సుబ్రహ్మణ్యం, డీసీసీబీ డైరెక్టర్లు పట్లోళ్ల అంజిరెడ్డి, రాంచంద్రారెడ్డి, రామ్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బి.విష్ణువర్దన్‌రెడ్డి, కో ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ నారాయణరెడ్డి, సత్యనారాయణ, విఠల్‌రెడ్డి, అనంతయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, సర్వేయర్ రాందాస్, రెవెన్యూ సిబ్బంది, సహకార సంఘం బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

ధారూరు, జూలై 19: మండలంలోని రాంపూర్, అవుసుపల్లి, కొండాపూర్‌కలాన్, నర్సాపూర్ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల ప్రగతిని అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి శుక్రవారం పరిశీలించారు. ఈ పాఠశాలలో జరిగిన పనులను ఆమె తనిఖీ చేశారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి



షాద్‌నగర్ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

బస్సులు ఆపడం లేదని విద్యార్థుల ఆందోళన

కేశంపేట, జూలై 19: మండలంలో ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని విద్యార్థులు శుక్రవారం షాద్‌నగర్ ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళనకు దిగారు. మండలంలోని లేమామిడి, కేశంపేట, వేముల్‌నర్వ, ఇప్పలపల్లి, పాపిరెడ్డిగూడ గ్రామాల నుంచి ఉన్నత విద్య కొరకు విద్యార్థులు నిత్యం షాద్‌నగర్‌కు వెళ్తుంటారు. అయితే ఆయా గ్రామాల మీదుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సులు ఉదయం వేళల్లో ఆపడం లేదంటూ ఆందోళనకు దిగారు. బస్సులు ఆపకపోవడంతో కాలేజీలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం విద్యార్థులకు ప్రత్యేక బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. అయితే, ఈ విషయం ఆర్టీసీ ఉన్నతాధికారులకు చెబుతామని రూట్ డ్రైవర్లు విద్యార్థులకు చెప్పి పంపించారు. కేశంపేట మండలంలో అన్ని గ్రామాల్లో ఉదయం పూట బస్సులు ఆపేలా డీఎం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రారంభించిన రెండు రోజులకే..

నిలిచిపోయిన బస్ సేవలు

కులకచర్ల, జూలై 19: పరిగి నుంచి వయా ముజాహిద్‌పూర్, చౌడాపూర్ మీదుగా పాలమూర్‌కు ప్రారంభించిన ఆర్టీసీ బస్ ప్రారంభించిన రెండు రోజులకే నిలిచిపోయింది. గత నెలలో పరిగి డిపోకు కొత్త బస్సులు వచ్చాయి. కొత్తగా మండలం ఏర్పడిన చౌడాపూర్ మండలంలోని ఆయా గ్రామ ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నెలరోజుల క్రితం పరిగి నుంచి వయా ముజాహిద్‌పూర్, కులకచర్ల, చౌడాపూర్, మరికల్, నవాబుపేట మీదుగా పాలమూర్‌కు బస్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత రెండు రోజులకే బస్ సేవలు నిలిచిపోయాయి. తమ గ్రామాలకు బస్ సౌకర్యం ఎంతో సంతోషడిన ఆయా గ్రామాల ప్రజలకు నిరాశే మిగిలింది. చౌడాపూర్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం, పోలీస్‌స్టేషన్ లేదు. ఇందుకు మండల ప్రజలు కులకచర్లకు రావాల్సిందే. ప్రారంభించిన బస్సు నిలిచి పోవడంతో ఆటో, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి వస్తున్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవ తీసుకొని నిలిచిపోయిన చౌడాపూర్, మరికల్ మీదుగా పాలమూర్ బస్సును కొనసాగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అరుణాచలం యాత్రకు ఆర్టీసీ బస్సు

» ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అరుణాచలం బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్ అర్బన్, జూలై 19: తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం దైవ దర్శనానికి ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ట్రయల్ రన్‌గా షాద్‌నగర్ డిపో నుంచి శుక్రవారం పంపిన బస్సును వర్షంలోనే ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతీ ప్రయాణికుడు వెళ్లి రావడానికి 3,600 రూపాయల టికెట్టును తీసుకున్నారు. శనివారం ఉదయం కాణిపాకం, అటు నుంచి గోల్డెన్ టెంపుల్‌కు వెళ్లి, అనంతరం అరుణాచలం వెళ్తుందని డిపో మేనేజర్ తెలిపారు. అరుణాచలంలో ఆదివారం గిరి ప్రదక్షణ చేయించుకుని సోమవారం ఉదయం తిరిగి షాద్‌నగర్‌కు బస్సు చేరుకుంటుందని తెలిపారు. భక్తుల డిమాండ్‌ను బట్టి అరుణాచలం బస్సులను నడిపిస్తామని డీఎం తెలిపారు.



రైతులకు చెక్కులు అందచేస్తున్న సత్యనారాయణ

'హెరిటేజ్' పాడి రైతులకు రూ.2లక్షల ప్రమాద బీమా సదుపాయం

కడ్తాల్, జూలై 19: హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు రూ.2లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు జోనల్ ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు. రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమతో లాభాలు గడించి ఆర్థికంగా వృద్ధి చెందాలని ఆయన కోరారు. కడ్తాల్ మండలం రావిచెడ్‌లో శుక్రవారం హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన సదస్సు, రుణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఒక్కొక్క రైతుకు రూ.50 వేల చొప్పున వంద మందికి రుణాలు అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ పాడి పరిశ్రమ ద్వారా మంచి ఆదాయం పొందవచ్చునని చెప్పారు. హెరిటేజ్ డెయిరీ ద్వారా దాణా, పశువులకు ఇన్సూరెన్సు, రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ వెంకటేశం, ప్లాంట్ మేనేజర్ నరేష్, సూపర్ వైజర్ శివ, డాక్టర్ ప్రభాకర్, ఏజెంట్ శ్రీశైలం, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జిగా శ్రీశైలం



ఇబ్రహీంపట్నం, జూలై 19: బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జిగా నిట్టు శ్రీశైలంను నియమిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన శ్రీశైలం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి అత్యంత సన్నిహితుడిగా ఉన్న శ్రీశైలం పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కరీంనగర్ జిల్లాలో ఓబీసీలను ఏకంచేసి బీజేపీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

కొత్త నేర చట్టాలపై

అవగాహన కలిగి ఉండాలి

పరిగి, జూలై 19: కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రతీఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరముందని వికారాబాద్ కోర్టు సీనియర్ న్యాయవాది ఎం.గోపాల్‌రెడ్డి అన్నారు. న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు జి.కృష్ణారెడ్డి అధ్యక్షతన శుక్రవారం పరిగి బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన నేరచట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త చట్టాల అమలులో కొంత ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. ఈ విషయాన్ని ప్రతి న్యాయవాది, ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు యాదవరెడ్డి, సీనియర్ న్యాయవాది ఆనంద్‌గౌడ్, ఎస్ఐ సంతోష్‌లు చట్టాల గురించి వివరించారు. న్యాయవాదులు లింగం, బి.వెంకట్‌రెడ్డి, నరేంద్రయాదవ్, దయాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, గౌస్‌పాష, శ్రీశైలం, జయలక్ష్మి పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక పనులు చేయొద్దు

వికారాబాద్, జూలై 19: చట్ట వ్యతిరేక పనులు చేయవద్దని వికారాబాద్ సీఐ నాగరాజు తెలిపారు. పట్టణంలోని రౌడీషీటర్ల నివాసాలకు, వారు పని చేసే ప్రాంతాలను శుక్రువారం సందర్శించి వారితో మాట్లాడారు. ఎవరూ కూడా చట్ట వ్యతిరేక పనులు చేయరాదని రౌడీ షీటర్స్ సస్పెక్ట్‌పైన ఎల్లప్పుడు నిఘా ఉంటుందన్నారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలలో పాల్గొన్నట్లు తెలిస్తే కఠినచర్యలుంటాయని హెచ్చరించారు.

గంజాయికి అలవాటు పడి..

పెడ్లర్‌గా మారి!

» గంజాయి సరఫరా చేస్తున్న బీటెక్ విద్యార్థి

» మరో ఐదుగురితో కలిసి గంజాయి సేవిస్తుండగా నార్కోటిక్ దాడుల్లో పట్టుబడిన వైనం

» 150 గ్రాముల గంజాయి స్వాధీనం.. కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, జూలై 19 : గంజాయికి అలవాటుపడిన ఓ బీటెక్ విద్యార్థి డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. ఈ క్రమంలో గంజాయి సేవిస్తుండగా అతడితో పాటు మరో ఐదుగురు విద్యార్థులను పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇబ్రహీంపట్నం టౌన్‌లో ఓ ప్రైవేటు హాస్టల్‌పై నార్కోటిక్ బృందం, ఇబ్రహీంపట్నం పోలీసులు గురువారం రాత్రి సంయుక్తంగా దాడులు చేసి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరాదారుడితో కలిపి ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఇందులో గంజాయి సరఫరాదారుడు పరారీలో ఉన్నారు. సీఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ టౌన్‌కు చెందిన శ్రీరాముల సాత్విక్ (21) ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ.. ఇక్కడ ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నాడు. కాగా, అతనికి సిరిసిల్ల సమీపంలోని ఇల్లంతకుంటకు చెందిన నవీన్(25)తో పరిచయం ఏర్పడింది. నవీన్ భద్రాచలం ఏజెన్సీ ఏరియా నుంచి గంజాయిని తీసుకొచ్చి సాత్విక్‌కు సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో గంజాయికి అలవాటుపడిన సాత్విక్ పెడ్లర్‌గా మారి ఇబ్రహీంపట్నం పరిసరాల్లో చదువుతున్న విద్యార్థులకు గంజాయి పాకెట్లను విక్రయిస్తున్నాడు. ఇదే క్రమంలో తాను చదువుతున్న కళాశాలలోనే బీటెక్ విద్యార్థులు నూకల సంపత్‌నాయుడు (20), స్వయంపాకుల కార్తీక్ (20), ఓ మైనర్‌లతోపాటు నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఓ కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తున్న పడాల వంశీ(20), దంపేట గణేష్ (21)లతో పరిచయం పెంచుకున్నాడు. నవీన్ మినహా పై ఆరుగురు ఇబ్రహీంపట్నంలోని ఓ హాస్టల్‌లో గంజాయి సేవిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు.. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో నార్కోటిక్ బృందం, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. కాగా, సాత్విక్‌పై ఇదే విషయంలో మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కూడా గతంలో ఓ కేసు నమోదైంది. నవీన్‌పై మీర్‌పేట్‌లో ఓ కేసు, సిరిసిల్లలో మూడు కేసులున్నాయి. ఈ మేరకు వీరిపై కేసులు నమోదు చేశామని, గంజాయి అమ్మకందారైన సాత్విక్‌ను రిమాండ్‌కు పంపినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మరో నిందితుడు నవీన్ పరారీలో ఉన్నట్లు చెప్పారు.

డీఎస్సీ పరీక్షలు

ప్రశాంతం

» రెండోరోజు ఉదయం పరీక్షకు 3,482, మధ్యాహ్నం పరీక్షకు 6,870మంది హాజరు



రంగారెడ్డి అర్బన్, జూలై 19 : రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాత పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మొదటిసారిగా ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో ఈ పరీక్షలను పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తుంది. ఈ పరీక్షలకు జిల్లాలో 8 సెంటర్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం రెండో రోజు ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 3,675 మంది హాజరు కావాల్సి ఉండగా 3,482మంది హాజరయ్యారు. 85 శాతం హాజరు నమోదైంది. 193 మంది హాజరు కాలేదు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 7,212 మంది హాజరు కావాల్సి ఉండగా 6,870 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 95 శాతం హాజరు నమోదైంది. 342మంది హాజరు కాలేదు.

గ్రీన్ బెల్టు ఉన్నట్టా...! లేనట్టా..?



చెరువుకట్ట కింద జాతీయ రహదారికి అనుకుని నిర్మిస్తున్న షెడ్

మేడ్చల్ టౌన్, జూలై 19: మేడ్చల్ పెద్ద చెరువు కట్టకు అనుకుని ఉన్న వ్యవసాయ పొలాలను గ్రీన్ బెల్టు కింద ప్రకటిస్తూ గత ప్రభుత్వాలు జారీ చేసిన జీవో కాగితాలకే పరిమితమైంది. చెరువు కింది స్థలాలు ఎల్లప్పుడు పచ్చగా ఉండటంతో పాటు చెరువు కట్ట ఉనికిని కాపాడాలన్న ఉద్దేశ్యంతో గత ప్రభుత్వాలు పెద్ద చెరువు కట్ట కింది వ్యవసాయ పొలాలను గ్రీన్‌బెల్టు జోన్ కింద ప్రకటిస్తూ జీవోను జారీ చేసింది. అప్పటి నుంచి చెరువుకట్ట కింది పొలాల్లో వ్యవసాయంతప్ప ఇతర నిర్మాణాలను నిషేదించారు. అయినప్పటికీ ఈ ప్రాంతంలో ఉన్న రైతుల వద్ద నుంచి కొందరు స్థలాలు కొని పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపడుతున్నారు. మరికొందరు అద్దెకు స్థలం తీసుకుని తాత్కాలిక షెడ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకునే పాపాన పోవటంలేదు. గ్రీన్ బెల్టులో చేపట్టిన నిర్మాణాలతో చెరువు తూముల ద్వార నీరు పారే కాల్వలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ విషయంలో ఇరిగేషన్ శాఖ అధికారులకు స్పష్టమైన సమాచారం ఉన్నప్పటికీ వారు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వందల ఎకరాలకు సాగు నీరు, వేల ఎకరాలకు భూగర్భ జలాలు అందించే పెద్దచెరువు ఉనికిని కాపాడాలన్న ఉద్దేశ్యంతో గత పాలకులు చెరువు కట్ట కింది స్థలాలను గ్రీన్‌బెల్టు జోన్ కిందకు కేటాయించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రీన్‌బెల్టుకు తూట్లు పొడుస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. గ్రీన్‌బెల్టు స్థలంలో ముందుగా మట్టినింపి చదును చేసుకుని తాత్కాలిక షెడ్‌లు వేసి అనంతరం పక్కా భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు.

జాతీయ రహదారికి అనుకుని నిర్మాణాలు

గ్రీన్‌బెల్టు కింద కేటాయించిన వ్యవసాయ పొలాలు పెద్దచెరువు కట్ట నుంచి జాతీయ రహదారి వరకు ఉన్నాయి. దీంతో రహదారికి అనుకుని ఉన్న భూములకు పెద్దఎత్తున డిమాండ్ ఉండటంతో కొందరు గ్రీన్‌బెల్టు పరిధిలోని భూములు కొని వాటిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. మేడ్చల్ పట్టణం నుంచి చెక్‌పోస్టు వరకు దాదాపు రెండు కిలోమీటర్ల పొడవున జాతీయ రహదారికి అనుకుని గ్రీన్‌బెల్టు జోన్ ఉంది. ఈ గ్రీన్‌బెల్ట్‌లో నిర్మాణాలు చేపట్టదలచిన వారు ముందుగా జోన్ మార్పిడికి దరఖాస్తు చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించింది. అనంతరం ఇరిగేషన్, హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు తగిన విచారణ జరిపి సమర్పించే నివేదిక ఆధారంగా నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తారు. ప్రధానంగా నిర్మాణాలకు దరఖాస్తు చేసుకునే ప్రాంతం కట్టకు కనీసం 100మీటర్లు దూరాన ఉండాలి. నిర్మాణాలతో చెరువు కట్టకు, కట్ట కింద కాలువకు, ఇతర వ్యవసాయ పొలాలకు ఇబ్బందులు కలగకుండా ఉండాలి. అనంతరం ప్రభుత్వం తగిన ఫీజులు వసూలు చేసి నిర్మాణం కోసం అనుమతి జారీచేస్తుంది. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుంటే లక్షల రూపాయలు ప్రభుత్వానికి ఫీజులు చెల్లించటంతో పాటు కాలయాపన జరుగుతుందన్న ఉద్దేశ్యంతో కొందరు కట్టకు వంద మీటర్ల లోపు నిర్మాణాలు చేపట్టేవారు. మరికొందరు దొంగచాటుగా నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మూడుపువ్వులు ఆరుకాయల్లా కొనసాగుతున్న ఈనిర్మాణాలకు ఇరిగేషన్‌శాఖ అధికారుల అభయహస్తం ఉందన్న ఆరోపణలు పెద్దఎత్తున వినబడుతున్నాయి.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ



తహసీల్దార్ కార్యాలయంలో దాడి చేసుకుంటున్న ఇరువర్గాలు

మర్పల్లి, జూలై 19: భూ వివాద విషయంలో ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ఓవ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం మర్పల్లిలో చోటు చేసుకుంది. మండలంలోని సిరిపూరం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 461, 462లో ఉన్న ఇనాం భూముల విషయంలో అదే గ్రామానికి చెందిన బి.నర్సింహులు తన వర్గంతో, అదే గ్రామానికి చెందిన మాణిక్‌రావు (మల్లేశం), తుమ్మలపల్లి గ్రామానికి చెందిన దొడ్ల జయరాజ్‌తో కలిసి శుక్రవారం మర్పల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అక్కడున్న తహసీల్దార్‌తో మాట్లాడి ఆర్ఐ దగ్గరికి వెళ్లి ఇనాం భూమి విషయంపై అడుగగా ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగింది. టేబుల్‌పై ఉన్న కర్ర, పేపర్‌పై ఉంచిన రాయితో ఒకరిపై ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అక్కడున్న కొంత మంది వారిని అడ్డుకున్నా వినిపించుకోలేదు. దీంతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ సురేశ్ సంఘటనా స్థలానికి చేరుకోవడంతో అప్పటికే గొడవ సద్దుమణిగింది. ఈ సంఘటనలో సిరిపూరం గ్రామానికి చెందిన మాణిక్‌రావు తలకు తీవ్రగాయాలు కావడంతో ఆయనను మర్పల్లి ఆసుపత్రికి తరలించారు. మాణిక్‌రావు ఫిర్యాదు మేరకు మరో వర్గం వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు. అధికారులు సమక్షంలోనే ఇరువర్గాలు దాడి చేసుకోవడంతో అక్కడున్న అధికారులతో పాటు వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన రైతులు, భూ విక్రయ, కొనుగోలుదారులు భయాందోళనకు గురయ్యారు. భూ తగాదాల్లో తరచూ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఇలాంటి సంఘటనలు జరుగుతుండగా శుక్రవారం కార్యాలయంలో అధికారుల ముందే దాడి చేసుకున్న సంఘటనతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

శిథిలావస్థలో ఉన్న పాఠశాలను

పరిశీలించిన కడా ప్రత్యేకాధికారి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

కొడంగల్ రూరల్, జూలై 19: మండలంలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శిథిలావస్థలో ఉందని గ్రామస్థులు ఇటీవలే కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పాఠశాలను సందర్శించి మరమ్మతు చర్యలు తీసుకోవాలని తెలపడంతో శుక్రవారం కడా ప్రత్యేకాధికారి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మల్లేశ్ తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో, ఎంపీవోల బదిలీ

బషీరాబాద్/తాండూరు రూరల్, జూలై 19: బషీరాబాద్ ఎంపీడీవో జె.రాఘవులు, ఎంపీవో రమేష్ బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఎంపీడీవో నాగర్‌కర్నూల్ జిల్లా, ఎంపీవో మిర్యాలగూడ, పీఆర్ ఏఈ వంశీకృష్ణ షాద్‌నగర్, పంచాయతీ కార్యదర్శులు వివిధ మండలాలకు బదిలీపై వెళ్లనున్నారు. ఒకటి ఒకటి, రెండు రోజుల్లో ఇక్కడి నుంచి వీరందరూ రిలీవ్ కానున్నారు. అదేవిధంగా తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎంపీవో రతన్‌సింగ్ బదిలీపై పెద్దేముల్ ఎంపీవోగా వెళ్లారు. కొడంగల్ మండల ఎంపీవోగా పనిచేస్తున్న శ్రీనివాస్ తాండూరు మండలం ఎంపీవోగా బదిలీపై వచ్చారు. వీరితో పాటు ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు కూడా బదిలీపై వెళ్లారు.

ఎరువుల కృత్రిమ

కొరత సృష్టించొద్దు

ఆమనగల్లు, జూలై 19: ఎరువుల, పురుగు మందుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని మండలవ్యవసాయ శాఖ అధికారి అరుణకుమారి హెచ్చరించారు. ఎరువుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ఎరువుల, విత్తన దుకాణాలను శుక్రవారం అరుణ కుమారి తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. డీలర్లు తదితరులు ఉన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు

'నిఖిల్‌చేతన్'లో

ఘనంగా గురుపౌర్ణమి

» వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులతో ర్యాలీ

కందుకూరు, జూలై 19 : మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో గల నిఖిల్‌చేతన్ ఆశ్రమంలో ఈనెల 21న గురుపౌర్ణమిని పురష్కరించుకొని వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈమేరకు శుక్రవారం తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరప్రదేశ్, ఛత్తీష్‌గఢ్, రాజస్థాన్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆశ్రమం గురూజీ అనిల్‌కుమార్ జోషి మండల కేంద్రం నుంచి పులిమామిడిలోని ఆశ్రమం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. భజన, భక్తి పాటలు, నృత్యాలతో ర్యాలీ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు కొనసాగింది. దాదాపు రెండు వేలకు పైగా భక్తులు పాల్గొన్నారు. శనివారం, ఆదివారం ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



దర్శనం అనంతరం నాయకులతో భక్త చరణ్ దాస్ దంపతులు

చిలుకూరు బాలాజీ సేవలో కేంద్ర మాజీ మంత్రి

మొయినాబాద్ రూరల్, జూలై 19: కలియుగ దైవం చిలుకూరు బాలాజీని కాంగ్రెస్ జాతీయ సీనియర్ నాయకుడు, సీడబ్ల్యూసీ మెంబర్, కేంద్ర మాజీ మంత్రి భక్త చరణ్‌దాస్ దంపతులు దర్శించుకున్నారు. మండలం పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయానికి శుక్రవారం వచ్చిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టతను ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ వారికి వివరించారు. ఆలయానికి సంబంధించిన చరిత్ర పుస్తకాన్ని అందజేశారు. వారి వెంట మండలాధ్యక్షుడు తమ్మలి మాణయ్య, సీనియర్ నాయకులు పురాణం వీరభద్రస్వామి, మర్రి రవీందర్‌రెడ్డి, శ్రీరాంనగర్ జంగారెడ్డి తదితరులు ఉన్నారు.



చేవెళ్ల : చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

చేవెళ్ల/షాబాద్, జూలై 19 : పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 55 మంది లబ్ధిదారులకు రూ.17లక్షల 99వేలు చెక్కులను అందించారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఆసుపత్రిలో చేరిన వారికి సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సున్నపు వసంతం, సాత ప్రవీణ్‌కుమార్, షాబాద్ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకులు మహేందర్‌గౌడ్, రాజశేఖర్, ఆంజనేయులు, మహేష్, అనంతరెడ్డి, రాజు, ఆయా గ్రామాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి




అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న పులిమామిడి గ్రామస్తులు

కందుకూరు, జూలై 19: మండలంలోని పులిమామిడి గ్రామంలో రూ.కోట్ల విలువచేసే 7ఎకరాల 13గుంటల ప్రభుత్వ భూమి, నక్షబాటను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఆ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని గ్రామస్తులు శుక్రవారం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నేత అనేగౌని దామోదర్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడారు. పులిమామిడి రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 77లో రియల్‌ఎస్టేట్ వ్యాపారి పూర్ణచందర్‌రెడ్డి ఫామ్‌ల్యాండ్ పేరుతో 7ఎకరాల 13గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని ఆరోపించారు. ఎకరం ధర కోటికి పైనే ఉంటుందని, ప్రభుత్వ భూమితో పాటు పెద్ద తండావాసులు వ్యవసాయ భూములకు వెళ్లడానికి పూర్వం నుంచి ఉన్న నక్షబాటను సైతం కబ్జా చేశారన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు విన్నపించడం జరిగిందని, అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అదనపు కలెక్టర్, డీఆర్వో రాజులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. వెంటనే ప్రభుత్వ భూమిని సర్వేచేసి స్వాధీనం చేసుకొని, నక్షబాటను చూపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు బుక్క పాండు రంగారెడ్డి, సీహెచ్ రమేష్, టి.శేఖర్, పి. రవీందర్‌లు పాల్గొన్నారు.

పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చే వరకూ పోరాటం

» సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల, జూలై 19 : పట్టణ కేంద్రంలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని, అప్పటి వరకూ పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య డిమాండ్ చేశారు. గతేడాది చేవెళ్లలో సీపీఐ ఆధ్వర్యంలో చేవెళ్లలోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 75లో పేదలు గుడిసెలు వేయడంతో.. అప్పట్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమకుల జంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, పానుగంటి పర్వతాలు, చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి, నాయకులు సుధాకర్‌గౌడ్, శ్రీనివాస్, నరేష్, కృష్ణగౌడ్, వినోద్, తదితరులపై చేవెళ్ల పోలీస్‌లు కేసు నమోదు చేశారు. ఈమేరకు కేసు విచారణ శుక్రవారం చేవెళ్ల కోర్టులో జరిగింది. రాష్ట్ర నాయకులు తప్ప.. జిల్లా నాయకులలందరూ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భగా జంగయ్య మాట్లాడుతూ పేదల గూడు కోసం గుడిసెలు వేస్తే.. అప్పటి ప్రభుత్వం, పోలీస్‌లు తమ నాయకులపై కేసులు నమోదు చేశారని గుర్తుచేశారు. కేసులకు భయపడేది లేదన్నారు. సీపీఐ నాయకులు తదితరులు ఉన్నారు.

రుణమాఫీతో రైతన్నల ఆనందం

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- సీఎం రేవంత్ చిత్రపటాలకు పాలాభిషేకం


కడ్తాల్ : గానుగుమర్ల తండాలో రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం..


ఆమనగల్లు : మేడిగడ్డలో కూలీలతో కలిసి పాలాభిషేకం చేస్తున్న విజయ్‌రాథోడ్


చేవెళ్ల : రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు


కేశంపేట : రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, జూలై 19: రుణమాఫీతో రైతు కళ్లల్లో ఆనందం కనిపిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం కేశంపేట మండలంలోని కొత్తపేట, కేశంపేట గ్రామాలలో రైతు రుణమాఫీ సంబురాలు నిర్వహించారు. సీఎం చిత్రపటానికి రైతులతో కలిసి, ఎమ్మెల్యే శంకర్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతుల నృత్యాలు చేశారు. అనంతరం రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేయకపోవడంతో పాటు వడ్డీని మోపిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మాట నిలుపుకుంటున్నట్లు వివరించారు. అలాగే మండల పరిధిలోని సంగెంలో వనమహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే శంకర్ మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి రాజారత్నం, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, యెన్నం శ్రీధర్ రెడ్డి, భాస్కర్ గౌడ్, అనుమగళ్ల రమేష్, రావుల పెంటయ్య, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : గూడూర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉప్పల దయానంద్‌గుప్త ఆధ్వర్యంలో నాయకులు రుణమాఫీ సంబురాలు జరుపుకున్నారు. రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోది దర్శన్, సిద్దూగౌడ్, ఆంజనేయులు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : రైతులకు రూ. 2 లక్షల పంట రుణాల మాఫీ దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మెదక్‌పల్లి, గట్టిప్పలపల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రుణ మాఫీ సంబరాల్లో పాల్గొన్నారు. సీఎం రేవంత్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణ మాఫీ చరిత్రాత్మక నిర్ణయమన్నారు. నాయకులు మోహన్ రెడ్డి, మిట్టపల్లి అంజయ్య, భగవాన్ రెడ్డి, శ్రీశైలం, శ్రీనివాస్ రెడ్డి, అజీమ్, రఘురాములు, డేవిడ్, రవీందర్ యాదవ్, గట్ల కేశవ రెడ్డి, ఆరీఫ్, జనార్ధన్ రెడ్డి, రమేష్ యాదవ్, తదితరులున్నారు.

కడ్తాల్ : రాష్ట్రంలో రైతులకు రుణ విముక్తి చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందని డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్య నాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు, గిరిజన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జర్పుల లక్పతినాయక్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోత్య నాయక్‌లు అన్నారు. గానుగుమర్ల తండాలో రుణమాఫీ సంబరాలు జరుపుకున్నారు. తండాలో ర్యాలీ నిర్వహించారు. రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గోప్యా నాయక్, జాన్యా నాయక్, రాజు నాయక్, భాస్కర్, దేశ్యా నాయక్, చంద్రు, హరిలాల్, సక్రు తదితరులున్నారు. రావిచెడ్ గ్రామంలో పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. పారేశా, రమేష్ గౌడ్, అంజయ్య, రాజు, సంతోష్, రవి, పవన్, వినోద్, రాఘవేందర్, దేవేందర్, తదితరులున్నారు

ఆమనగల్లు : రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ మాట నిలుపుకుందని కేవీఎస్ఆర్ యువసేన జిల్లా నాయకులు విజయ్ రాథోడ్ అన్నారు. మేడిగడ్డ తండాలో రుణ మాఫీ సంబరాలు జరుపుకున్నారు.


కొత్తూర్ : గూడూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కూలీలు, రైతులతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తావుర్య, హర్యా, పత్యా, గోర్యా, చంద్రు, లోక్యా, వెంకట్యా, రవి, శ్రీను, దేవులా, హేమి, ముత్యాలి, దోలి, సీత్లి తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జీ పామెన భీంభరత్ అన్నారు. రైతు రుణమాఫీ సంబురాల్లో భాగంగా మండల కేంద్రంలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, రైతులకు స్వీట్లు పంచిపెట్టి, బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. అదేవిధంగా హైతాబాద్, సోలిపేట్, చందన్‌వెల్లి, కుర్వగూడ, కక్కులూర్, ముద్దెంగూడ తదితర గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి, సీనియర్ నాయకులు తమ్మలి రవీందర్, అక్తర్‌పాష, చల్లా మాధవరెడ్డి, అశ్మత్‌పాష, సబ్బరిగారి రాజు, పెంటారెడ్డి, భార్గవరామ్, గడ్డం చంద్రయ్య, మద్దూర్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ తెలిపారు. పట్టణ కేంద్రంలో భీంభరత్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డిల ఆధ్వర్యంలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై సీఎం చిత్రపటంతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌స్వామి, పీఏసీఎస్ చైర్మన్‌లు ప్రతాప్‌రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు ప్రభాకర్, దాయకర్, పొట్ట రామకృష్ణ, మాణిక్యరెడ్డి, ప్రశాంత్, భాలయ్య, నాయకులు ఉన్నారు.

శంషాబాద్ : కాంగ్రెస్ రైతుల పార్టీ అని, రైతులకు రుణమాఫీ అమలు హామీ నిలబెట్టుకుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌లు అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పీసీసీ ఎస్సీసెల్ వైస్ చైర్మన్ నరేందర్, డీసీసీ నాయకురాలు సులోచన, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కందుకూరు : సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని చరిత్రలో నిలిచారని


తలకొండపల్లి : గట్టిప్పలపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మాజీ వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్‌లు అన్నారు. నేదునూరు గ్రామంలో రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కొత్తగూడ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొక్క సంజీవరెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సురేష్, సురేందర్‌రెడ్డి, రూప్‌చందర్, ఎస్.మాధవరెడ్డి, ఎగిరిశెట్టి నర్సింహ, బాబు, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్ అన్నారు. శంకర్‌పల్లి చౌరస్తాలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు సత్యనారాయణ రెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, ఉదయ్‌మోహన్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, నర్సింలు, తదితరులున్నారు.


శంకర్‌పల్లి : సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం భీంభరత్, నాయకులు


షాబాద్ : సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, తదితరులు


కందుకూరు : నేదునూరులో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు


శంషాబాద్ : సీఎం, భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

క్రైం కార్నర్

వ్యక్తి మరణానికి కారణమైన నలుగురు మహిళల రిమాండ్

- అసభ్య ప్రవర్తన భరించలేక వ్యక్తిని చెట్టుకు కట్టేసిన వైనం
- ప్రాణాలు కోల్పోవడంతో మహిళలపై కేసు నమోదు

శంషాబాద్, జూలై 19 : మహిళల పట్ల ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని చెట్టుకు కట్టేసి.. అతడి ప్రాణాలు కోల్పోయేలా చేసిన నలుగురు మహిళలపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ప్రకాష్‌నగర్ బస్తీకి చెందిన రాచమల్ల కుమార్ మృతికి కారణమైన నలుగురు మహిళలను శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ సీఐ బాల్‌రాజ్ తెలిపారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన రాచమల్ల కుమార్(35) నిత్యం పూటుగా మద్యం సేవించి కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల వారిని వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో ప్రకాష్‌నగర్‌కు చెందిన పావని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, కుమార్ రూములో ఒంటరిగా ఉంటాడని, అతడి తల్లి వృద్ధురాలు.. మతిస్థిమితం సరిగా లేదని పోలీసులు తెలిపారు. 20 ఏళ్లుగా తాగుడుకు బానిసై బస్తీలో అందరితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని పోలీసుల విచారణలో తేలింది. గతంలో సొంత చెల్లెలితో అసభ్యంగా ప్రవర్తించగా.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. 5 సంవత్సరాల జైలు శిక్ష కూడా అనుభవించాడు. ఈనెల 17న సాయంత్రం కుమార్ మద్యం సేవించి ఇంటి పక్కన ఉండేవారితో అసభ్యకర మాటలతో ఇబ్బందిపెట్టాడు. మీ బట్టలు విప్పుతా అని బెదిరించడంతో.. అతడి సోదరితో పాటు మరో ముగ్గురు మహిళలు కలిసి కుమార్‌పై దాడిచేసి చెట్టుకు కట్టేశారు. రెండు గంటల తర్వాత కట్లు విప్పిచూడగా.. చనిపోయినట్లు భావించారు. శరీరంపై గాయాలు ఉన్నాయని, అందుకే మరణించాడని మహిళలు వాపోయారు. అయితే, తాము కుమార్‌ను చెట్టుకు కట్టేస్తేనన్నా బుద్ధి వస్తుందని మాత్రమే భావించినట్లు వారు తెలిపారు. గాయాలకు మాకు సంబంధం లేదని వారు తెలిఆపరు. పోలీసులు కేసు నమోదు చేసి మృతుడి సోదరి చంద్రకళతో పాటు కృష్ణవేణి, సంగీత, మహేశ్వరి అనే మరో ముగ్గురు మహిళలను అరెస్టు చేశారు. ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను శుక్రవారం రిమాండ్‌కు పంపారు.

వ్యక్తి మరణానికి కారణమని యువకుడికి రెండేళ్ల జైలు

శంకర్‌పల్లి, జూలై 19 : బైక్‌ను అతివేగం, నిర్లక్ష్యంగా నడిపి ఓ వ్యక్తి మరణానికి కారణమైన యువకుడికి ఎల్‌బీ నగర్ అదనపు జిల్లా కోర్టు శుక్రవారం రెండు సంవత్సరాల జైలు, రూ.10వేల జరిమానా విధించింది. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. 2021 అక్టోబర్ 7న మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామానికి చెందిన ఆవురం బుచ్చిరెడ్డి(41) వ్యక్తిగత పనుల నిమిత్తం బైకుపై ఉదయం శంకర్‌పల్లికి వచ్చి సాయంత్రం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈక్రమంలో మోకిల శివారులోని సుభిషి టౌన్‌షిప్ వద్ద ఎదురుగా జబ్బాని కేశవులు అనే యువకుడు బైకును అతివేగం, నిర్లక్ష్యంగా నడుపుతూ వచ్చి బుచ్చిరెడ్డిని బలంగా ఢీకొట్టాడు. దాంతో తీవ్రగాయాలైన బుచ్చిరెడ్డిని శంకర్‌పల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసిన పోలీసులు శుక్రవారం ఎల్‌బి నగర్ అదనపు జిల్లా కోర్టులో తగు సాక్ష్యాధాలతో నిందితుడిని హాజరుపరిచారు. విచారణ చేపట్టి నిందితుడు కేశవులుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించింది.

పుస్తెలతాడు అపహరణ కేసులో ఇద్దరు రిమాండ్

యాచారం, జూలై 19 : యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొగుళ్లవంపు గ్రామంలో మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరించిన ఇద్దరిని శుక్రవారం పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు పంపారు. ఇటీవల మొగుళ్లవంపు గ్రామంలో రజిత అనే మహిళ వ్యవసాయ పొలానికి వెలుతుండగా.. నల్గొండ జిల్లా పీఏ పల్లి మండల కేంద్రానికి చెందిన మునావత్ రమేష్‌తో పాటు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని బండ్లగూడ గ్రామానికి చెందిన కిషోర్‌లు ఆమెను ఫాలో అయ్యారు. మాటలు కలిపి మెడలో ఉన్న మూడున్నర తులాల మంగళసూత్రం అపహరించారు. ఆమె గట్టిగా అరవడంతో పంట పొలాల్లో ఉన్న రైతులతో పాటు కొంతమంది గ్రామస్తులు వారిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారించడంతో నేరం అంగీకరించారు. కాగా, రమేష్ బైక్ దొంగతనం, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడినట్లు నల్గొండ జిల్లా చింతపల్లి, కన్‌గల్, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మౌలాలి, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మాడ్గుల, చంపాపేట ప్రాంతాల్లో కేసులున్నాయి. మాడ్గుల పోలీస్‌స్టేషన్ పరిధిలో పీడీ యాక్ట్ కింద కేసు నమోదైంది. కిషోర్ రాత్రివేళ తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి చోరీ చేయడంతో పాటు బైక్‌లు అపహరించడం వంటివి చేసేవాడు. ఈమేరకు శుక్రవారం అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై గోపాల్, సీఐ శంకర్‌కుమార్‌లు తెలిపారు.

దేవాలయాల్లో గంటల చోరీ

యాచారం, జూలై 19 : యాచారం పోలీస్ పరిధిలోని యాచారం, గున్‌గల్ గ్రామాల్లోని ఆలయాల్లో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మండల కేంద్రంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.25వేల విలువైన గంటలను, ముత్యాలమ్మ ఆలయంలో రూ.20వేల విలువైన గంటలను, గున్‌గల్‌లోని పెద్దమ్మ గుడిలో రూ. 20వేల విలువైన గంటలను చోరీ చేశారు. ఆయా ఆలయాల్లో చోరీలకు పాల్పడిన విషయం తెలుసుకున్న పోలీసులు దుండగుల కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. క్రైంపార్టీ పోలీసులు కూడా వారికోసం గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ చెప్పారు.

వీరన్న చెరువును పరిశీలించిన ఇరిగేషన్ శాఖ అధికారులు

ఆమనగల్లు , జూలై 19: మండల పరిధి శెట్టిపల్లి గ్రామంలోని వీరన్న చెరువును శుక్రవారం ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించారు. చెరువు మరమత్తు, ఆధునీకరణ గురించి కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎగిరి శెట్టి సత్యం, మాజీ సర్పంచ్ గోదాదేవిలు ఇటీవల ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. చెరువుకు మరమ్మతులు చేసి ఆధునీకరించాలని, చెక్‌డ్యాం నిర్మిస్తే వందల ఎకరాలకు సాగు నీరు అంది రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే చెరువును పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ డీఈ నరేందర్‌రెడ్డి, ఏఈ తిరుపతిరెడ్డిలు చెరువును సందర్శించి చేపట్టాల్సిన మరమత్తు పనులు, నిర్మించాల్సిన చెక్ డ్యాం స్థలాన్ని పరిశీలించారు. నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. త్వరితగతిన పనులు చేపట్టేలా చూడాలని సత్యం స్థానిక రైతులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డిని, అధికారులను విన్నవించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

కందుకూరు, జూలై 19: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి పేద విద్యార్థులకు బాసటగా నిలువాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు సిద్దు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఆ సంఘం నేతలతో పాటు వివిధ కళాశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో సుమారు రూ.730కోట్ల బకాయిలు ఉన్నట్లు గుర్తుచేశారు. నాయకులు ఎం.చరణ్, వినోద్, సందీప్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వీవోఏల సమస్యల పరిష్కారానికి కృషి : కసిరెడ్డి

తలకొండపల్లి, జూలై 19: వీవోఏల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పరంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. వీవోఏల సమస్యల గురించి సీఎంకు వివరిస్తానని పేర్కొన్నారు. తలకొండపల్లి మండల ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యేను గట్టిప్పలపల్లిలో కలిసి వినతి పత్రం అందచేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతీనెలా వేతనాలు వ్యక్తిగత ఖాతాలలో వేయాలని, జీవో నెం 58ని సవరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని వినతిపత్రంలో కోరారు. ఆయా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయుల సేవలు మరవలేనివి : వీర్లపల్లి

కేశంపేట, జూలై 19: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు మరువలేనివని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట మండలం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాససాగర్, శ్రీనివాస రావు, సాయి ప్రసాద్, శిరీష, శశికళ, కవిత, సుజాత, అబ్దుల్ బారి, రామ్ శంకర్, రాజులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్, హెచ్ఎం చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు జగదీశ్వరప్ప, నవీన్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్ టీచర్లు ఉన్నారు.

ఆశావర్కర్ల వేతనాలు పెంచాలి

- ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

చేవెళ్ల, జూలై 19 : ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న ఆశావర్కలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ చేవెళ్ల మండలంలోని ఆశవర్కర్లు శుక్రవారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యాదయ్యను కలిసి వినతి ప్రతం అందించారు. ఈసందర్భంగా ఆశావర్కర్లు మాట్లాడుతూ..ప్రతి నిత్యం ప్రజల్లో ఉండే తమకు ప్రభుత్వం నెలకు రూ. 18వేలు అందించాలన్నారు. ఈఎస్ఐ బీమా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియర్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు ధనలక్ష్మి, సుగుణమ్మ, గీత, లావణ్య, బాలమణి, పద్మ, నిర్మల, పావని, హేమలత తదితరులు ఉన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

యాచారం, జూలై 19 : సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ నర్సింహారావు అన్నారు. శుక్రవారం మండలంలోని మేడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేష్, తేజం రెడ్డిలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులున్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు శ్రీరామ్

మహేశ్వరం, జూలై 19 : విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ఏబీవీపీ ఎప్పటికప్పుడు ముందుంటుందని ఆ సంఘం రాష్ట్ర కార్యసమితి సభ్యుడు కందాడి శ్రీరామ్ అన్నారు. శుక్రవారం మహేశ్వరంలో ఏబీవీపీ కార్యవర్గసమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సమావేశంలో మహేశ్వరం నగర కార్యదర్శిగా రాజేష్‌ను నియమించామన్నారు. అదేవిధంగా 1949 లో ఆవిర్భవించిన ఏబీవీపీ అప్పటినుంచి ఇప్పటి వరకు దేశం మొత్తంమీద ప్రతీ రోజు విద్యార్థుల సమస్యలపై ఎనలేని పోరాటాలు చేస్తూ వస్తుందన్నారు. శ్రీనివాస్, సాయిచరణ్, రాఘవేంద్ర, ప్రవీణ్, అభిలాష్, ధనుష్, నందు, శివ, మనీ, వినయ్ తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

కందుకూరు : మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం నిర్వహించనున్న వారాంతపు సంతకు 2024-25 సంవత్సరాంకుగాను రూ.4,22,542లకు ఎడ్ల కృష్ణ వేలం పాటలో దక్కించుకున్నారు. పంచాయతీ ప్రత్యేక అధికారి బి.సరిత ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీవో విజయలక్ష్మి, కార్యదర్శి సురేందర్‌గౌడ్, తదితరులున్నారు.

కందుకూరు : గుమ్మడవెల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాంక్‌ఆఫ్ బరోడా(పంజాగుట్ట)బ్రాంచ్ మేనేజర్ రఘుకిషన్ క్రీడాసామగ్రి అందజేశారు. మేనేజర్ తండ్రి వేణుగోపాల్‌రావు, విశ్రాంత ఫారెస్టు అధికారి తల్లి వైశాలిలు రూ.30వేల విలువగల క్రికెట్ కిట్లు, క్యారం బోర్డులు, వాలీబాల్, చెస్ బోర్డు, లేజర్ త్రోబాల్స్ కొనుగోలు చేసి వారి కుమారుడు రఘుకిషన్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. మాజీ సర్పంచ్ ప్రభాకర్, హెచ్ఎం ఎం.ధర్మనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాచారం : యాచారం మండల కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయం ఆవరణలో గత ఆరు నెలలుగా ఓ ట్రాక్టర్ అక్కడే ఉంది. దీనికి నెంబర్‌ప్లేట్ కూడా లేదు. చాలా కాలంగా ఉన్న ట్రాక్టర్ వివరాలు మాకు తెలియవని ట్రాన్స్‌కో అధికారులు చెప్పారు. యాచారం గ్రామపంచాయతీదని ఏఈ చెప్పడంతో పంచాయతీ కార్యదర్శి తిరుపతిని వివరణ కోరగా తమది కాదని చెప్పారు.

యాచారం : త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికలలో పార్టీకి అధిక స్థానాలు దక్కేవిధంగా కార్యకర్తలు శ్రమించాలని బీజేపీ మండల మండలాధ్యక్షుడు రవీందర్ కోరారు. మండల కేంద్రంలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో రవీందర్ మాట్లాడారు. ఎంపీపీ,జెడ్పీటీసీ పదవులు కైవసం చేసుకునేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు గొల్లపల్లి జంగయ్యగౌడ్, వి.రవీందర్‌రెడ్డి, దేవరకొండ ఈశ్వర్ తదితరులున్నారు.

చేవెళ్ల : చేవెళ్ల పోలీస్‌లు బీజేవైఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. నాయకులు జయసింహరెడ్డి, మధుకర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు వేయకుండా నిరుద్యోగయువతను మోసం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వారి కలలను కాలరాస్తుందని ఆరోపించారు.

యాచారం : అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు తీర్చాలని, వారి వేతనాలు పెంచడంతో పాటు ఖాళీగా ఉన్న టీచర్ల, ఆయాల పోస్టులు భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో చలో సచివాలయం కార్యక్రమానికి వెలుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.బ్రహ్మయ్య, మండల నాయకులు పి.అంజయ్యలను శుక్రవారం తెల్లవారుజామున యాచారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా నిరుద్యోగ సమస్య తీర్చాలని, వివిధశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, యువతకు నిరుద్యోగ భృతి చెల్లించాలని తదితర డిమాండ్లలో చలో అసెంబ్లీ వెలుతున్న ఏబీవీపీ కార్యకర్తలు కృష్ణ, గణేష్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

ఆదిభట్ల : ఆదిభట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివే 12 సంవత్సరాలలోపు విద్యార్థులకు తెలంగాణ రాష్ట ఆర్టీసీ సంస్థ ద్వారా శుక్రవారం ఉచితంగా బస్‌పాసులు అందజేశారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వర్కాల పరమేష్, ఆర్టీసీ సిబ్బంది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాచారం : గత ఆదివారం ఉదయం తాటిపర్తికి చెందిన మద్దెల సత్యనారాయణ వాకింగ్ చేస్తుండగా.. మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసు కిందపడిపోయింది. బంగారు గొలుసు చేయించిన కొత్తలో సత్యనారాయణ, అతని భార్య సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. గొలుసు పోయినట్లు ఆదివారం మధ్యాహ్నం దంపతులు ఫోన్‌లో స్టేటస్ పెట్టుకున్నారు. తాటిపర్తి వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్‌ను గమనించిన గొల్లగూడకు చెందిన జంగయ్య శుక్రవారం మధ్యాహ్నం బంగారు గొలుసు తనకు లభించిందని సత్యనారాయణకు ఫోన్‌చేసి సమాచారమందించాడు. ఈమేరకు ఆ దంపతులకు జంగయ్య గొలుసు ఇచ్చాడు. దాంతో జంగయ్యను గ్రామస్తుల సమక్షంలో వారు ఘనంగా సత్కరించి రూ.పదివేల నగదు అందించారు.

ఆమనగల్లు : మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ వసంతలు 11వ వార్డు ఆదర్శనగర్ కాలనీలో వనమహోత్సవం నిర్వహించారు. ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు.

కడ్తాల్ : సలార్ పూర్ గ్రామ రైతులు మూడేళ్ళ భూసమస్య ఎట్టకేలకు పరిష్కారం అయింది. ఆయా భూములను పట్టా భూములుగా పేర్కొంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం ఉత్తర్వు కాపీని స్థానిక నాయకులు నేనావత్ శంకర్, రమేష్‌ల ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ ముంతాజ్‌కు అందచేశారు.

ఆమనగల్లు : దూప, దీప నైవేద్య అర్చకులకు రూ.18వేల కనీస వేతనం అందించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జంగా సుబ్రహ్మణ్యశర్మ డిమాండ్ చేశారు. పట్టణంలోని అయ్యప్పకొండపై ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల సంఘం సమావేశం నిర్వహించారు.

కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల దీక్షలు

కందుకూరు, జూలై 19: పెండింగ్ బిల్లులు, జీతాలు చెల్లించాలంటూ మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన రిలేనిరాహార దీక్షలు శుక్రవారంకు ఐదవ రోజుకు చేరుకున్నాయి. సీఐటీయు మండల కన్వీనర్ బుట్టి బాల్ రాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో సీపీఎం మండల కార్యదర్శి బుడ్డీరపు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు దామోదర్‌గౌడ్‌లు పాల్గొని మద్దతు తెలిపారు. కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత


కార్మికులతో కలిసి చెత్తను తొలగిస్తున్న చైర్మన్ నిరంజన్ రెడ్డి

ఆదిభట్ల/శంకర్‌పల్లి/ ఆమనగల్లు, జూలై 19 : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా భావించి ముందుకు సాగాలని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి అన్నారు. బొంగ్లూరు పరిధిలోని గంగానగర్ కాలనీలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్ మౌనిక ఉదయపాల్‌రెడ్డిలతో కలిసి కాలనీలలో పర్యటించారు. చెత్తను స్థానికులు, సిబ్బందితో కలిసి తొలగించారు. ఏఈ వీరాంజనేయులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ జాన్సన్, సురేష్, రామారావు, ఉదయ్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శంకర్‌పల్లి ఫత్తేపురంలో కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి ఆమె శుక్రవారం ఫ్రైడే-డ్రైడే నిర్వహించారు. కౌన్సిలర్ రాములు, మేనేజర్ అంజన్‌కుమార్, తదితరులున్నారు. ఆమనగల్లు మున్సిపల్ ఆదర్శనగర్ కాలనీలో డ్రైడే నిర్వహించారు. కమిషనర్ వసంత, చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో పోటీపడాలి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి

ఆమనగల్లు, జూలై 19: సామాజిక సేవ, ప్రజాచైతన్య కార్యక్రమాలలో స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు పోటీ పడాలని ఐక్యత ఫౌండేషన్ సభ్యుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుంకిరెడ్డి కృష్ణారెడ్డితో కలిసి వర ప్రసాద్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. చెన్నై శంకర నేత్ర వైద్యాలయం సహకారంతో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరం 27వరకు కొనసాగుతుందని వరప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.